క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న కాంట్రాక్టర్, నాయకులు

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్ కాశీమయ్య ఆదివారం మరణించారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు తక్షణ సాయం కింద కాంట్రాక్టర్ బసవరాజు రూ.10 వేలు సాయం అందించారు. బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. వాచ్‌మెన్ మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. నివాళులు అర్పించిన వారిలో గ్రామ సర్పంచ్ ఉచ్చప్ప, ఉప సర్పంచ్ తిక్కయ్య, వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు, నాయకులు ఉన్నారు.

కూలి రేట్లు పెంచాలి



డిపోల యజమానికి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఆదోనిరూరల్: గ్రానైట్, టైల్స్ డిపోల్లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.ఎస్.గోపాల్, అధ్యక్షులు తిప్పన్న, లక్ష్మన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. డిపోలో యాజమాన్యం వారు ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లు కుటుంబాన్ని పోషించుకునేందుకు ఏమాత్రం సరిపోవన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఎప్పుడు ఇస్తున్న రేట్లపై 50 శాతం పెంచాలని యజమానులను కోరారు. హమాలీలందరికీ డిపోల యాజమాన్యం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పని ప్రదేశంలో అనుకోకుండా ప్రమాదాలు జరిగితే యాజమాన్యం వారు బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్‌ఐ, పీఎఫ్, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హమాలీ సంఘం నాయకులు చిన్నా, నాగరాజు, పెద్ద నాగరాజు, తాయప్ప, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దాస సాహిత్య ప్రదర్శనలు



హరికథను ప్రవచిస్తున్న జ్ఞానమూర్తి

మంత్రాలయం: చతుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన దాస సాహిత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీమఠం ప్రాకారంలో ఆదివారం కర్ణాటకలోని కోలార్‌కు చెందిన జ్ఞానమూర్తి హరికథ ప్రవచనం గావించారు. శ్రీహరి దేవుడి చరితను అద్భుతంగా పండితులు ప్రవచించారు. అలాగే కర్ణాటక రాయచూరు జిల్లా విధ్వాంసుడు సీఎన్ రాఘవేంద్ర సంగీత కచేరి మైమరిపించింది. వాయు దేవుడు, శ్రీహరి విఠల, రాఘవేంద్రుల కీర్తనాలాపనలు వీనులవిందు చేశాయి. చాతుర్మాసం సందర్భంగా నాలుగు నెలలపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.గిడ్డయ్య

ఆదోనిరూరల్: 'రాష్ట్రాన్ని రక్షించండి.. దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ ప్రచార జాత, బస్సు యాత్ర చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.గిడ్డయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన సీపీఐ పట్టణ, మండల సమితి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2 తేదీల్లో కర్నూలు, కోడుమూరు, ఆలూరు, పత్తికొండలో బస్సు యాత్ర ఉంటుందని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు నాగరాజు, వెంకన్న, భీమేష్, షేక్షావలి, షాబీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

24న మండల సమావేశం

కోసిగి: స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన ఈ నెల 24వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సమావేశానికి మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమగ్ర నివేదికతో హాజరు కావాలని సూచించారు. అలాగే అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

ఉప ఎన్నికల్లో విజయ బావుటా

- ఒక సర్పంచ్, 7 వార్డు స్థానాలకు ఎన్నికలు
- సర్పంచు స్థానంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడి గెలుపు
- వార్డు స్థానాలూ కైవసం
- కేవలం ఒక్క వార్డు ఏకగ్రీవంతో సరిపెట్టుకున్న టీడీపీ



చాకలి లింగమ్మ



ఉరకుందమ్మ



లక్ష్మి



సుజాత



ముంతాజ్



కమ్మరి లక్ష్మి

మండలం	గ్రామం	వార్డు మెంబర్ పేరు	మెజారిటీ	బలపరిచిన పార్టీ
కౌతాళం	బదినేహాల్	పెద్ద నరసప్ప	387 ఓట్లు	వైఎస్సార్‌సీపీ
కౌతాళం	రౌడూరు-6	చాకలి లింగమ్మ	56 ఓట్లు	వైఎస్సార్‌సీపీ
కౌతాళం	గోతులదొడ్డి-8	పూజారి లక్ష్మి	ఏకగ్రీవం	టీడీపీ
కౌతాళం	కౌతాళం-12	ఉరుకుందమ్మ	ఏకగ్రీవం	వైఎస్సార్‌సీపీ
కౌతాళం	కుంభళనూరు-3	లక్ష్మి	ఏకగ్రీవం	వైఎస్సార్‌సీపీ
పెద్దకడబూరు	కల్లుకుంట-11	సుజాత	22 ఓట్లు	వైఎస్సార్‌సీపీ
పెద్దకడబూరు	గంగులపాడు-5	ముంతాజ్	ఒక్క ఓటు	వైఎస్సార్‌సీపీ
మంత్రాలయం	52-బసాపురం-3	కమ్మరి లక్ష్మి	ఏకగ్రీవం	వైఎస్సార్‌సీపీ

మంత్రాలయం: స్థానిక సంస్థల సమరంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయ బావుటా ఎగుర వేశారు. టీడీపీ కుట్రలను తిప్పికొట్టి తమ పట్టును చాటుకున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఒక సర్పంచ్, 7 వార్డు స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దుతుతో పెద్ద నరసప్ప బరిలో నిలిచి 387 ఓట్లతో గెలుపొందారు. అందులో కౌతాళం మండలం కుంభళనూరు-3, కౌతాళం-12 వార్డులు, మంత్రాలయం మండలం బసాపురం 3వ వార్డు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోతులదొడ్డి 8 వార్డులో మాత్రమే టీడీపీ మద్దతురాలు పూజారి లక్ష్మి ఏకగ్రీవంగా గెలుపొందారు. బదినేహాల్ సర్పంచ్, పెద్దకడబూరు మండలం గంగులపాడు 5వ వార్డు, కల్లుకుంట 11వ వార్డు, కౌతాళం రౌడూరు 6వ వార్డుకు ఎన్నికలు జరిగాయి. అందులో సర్పంచ్ గిరితోపాటు 3 స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. మొత్తంగా సర్పంచ్ గిరితోపాటు 6 స్థానాలు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ఒక్క వార్డు మాత్రమే టీడీపీ సొంతం చేసుకుంది. నియోజకవర్గంలో పార్టీకి ప్రజా మద్దతు మెండుగా ఉందని ఈ ఫలితాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పారదర్శక పాలన, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే స్థానిక ఎన్నికల్లో అత్యధికంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలుపొందినట్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న టూటౌన్ పోలీసులు

ఆదోనిఅర్బన్: డీఎస్పీ కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డు ఎం.దేవేంద్రప్ప శనివారం తన ఇంట్లో పెయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు ఆయన్ను కర్నూలు మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆదోని టూటౌన్ సీఐ కె.శ్రీనివాసనాయక్, ఎస్‌ఐ జి.చంద్ర, పోలీసు సిబ్బంది స్పందించి ఆర్థిక సాయం కింద రూ.27,300 నగదును బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందించారు. హోంగార్డు దేవేంద్రప్ప త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే



విద్యార్థిని శివలింగమ్మ, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిఅర్బన్: ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్న విద్యార్థిని శివలింగమ్మ ఆదివారం ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. తనకు ఈ అవకాశం వచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కౌతాళం మండలం పొదలకుంట గ్రామానికి చెందిన సోమనాథ్, గంగమ్మ దంపతుల నాలుగో సంతానమైన శివలింగమ్మ అమెరికా వెళ్లి ఐక్యరాజ్య సమితిలో మాట్లాడే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకోవడం గర్వకారణమన్నారు. ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు అమెరికా ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశం, కొలంబియా యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రాధిక అయ్యంగార్‌తో మీటింగ్‌తో పాటు వరల్డ్ బ్యాంకు ప్రతినిధులతో సమావేశం, వైట్‌హౌస్ సందర్శన వంటి అవకాశాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో విద్యావిధానంలో చేపట్టిన సమూల మార్పులు, సంస్కరణలపై ఐక్యరాజ్య సమితిలో మాట్లాడేందుకు విద్యార్థిని ఎంపిక కావడంపై ఆమెను అభినందించారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా నాగుల చవితి

ఆదోని అర్బన్: శ్రావణ మాసం, నాగులచవితి పండగను పట్టణంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా వీధుల్లో వెలసిన నాగులకట్టలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే ప్రత్యేక పిండి వంటలు చేసుకొని ఆలయంలో వెలిసిన నాగులకట్టకు, పుట్టలకు పాలు పోసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



నాగులకట్టకు పూజలు చేస్తున్న మహిళలు

ఉరుకుందకు పాదయాత్ర

ఆదోనిఅర్బన్: అంబాభవానీ యువజన మిత్ర మండలి సభ్యులు ఆదివారం పట్టణంలోని కిలిచిన్ పేట కాలనీ నుంచి ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం పాదయాత్రగా తరలివెళ్లారు. ముందుగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రగా తరలివెళ్లారు. యేటా తాము ఈరన్న స్వామి వారి దర్శనార్థం పాదయాత్రగా వెళ్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న అంబాభవానీ యువజన మిత్ర మండలి సభ్యులు

బాలుడిని ఢీకొన్న స్కూటరిస్ట్

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన గోవిందు కుమారుడు తిరుమలేష్ అనే 14 ఏళ్ల బాలుడిని వెనుక నుంచి నేలకోసిగికు చెందిన స్కూటరిస్ట్ ఢీకొట్టి వెళ్లాడు ఆ బాలుడు కిందకు పడగా తలకు, చెయ్యికి తీవ్ర గాయాలైయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ స్టాఫ్ నర్స్ సరస్వతి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని 3వ వార్డులో నివాసం ఉంటున్న లావణ్య అనే మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. 6 నెలల గర్భవతిగా ఉన్న లావణ్య మూడవ కాన్పు కోసం కోసిగి 9వ వార్డులోని పుట్టింటికి వచ్చింది. భర్తతో గొడవ పడి మనస్థానంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రి తరలించారు. అంబులెన్స్‌లో ఈఎంటీ మనోహర్, పైలట్ జగదీష్‌లు వైద్య సేవలు అందిస్తూ ఆదోని హాస్పిటల్‌కు చేర్చారు.

వ్యక్తి ఆత్మహత్య యత్నం

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన రంగస్వామి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. రంగస్వామి కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆదివారం పొలంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినికి సన్మానం

ఆదోని సెంట్రల్: నీట్ పరీక్షలో 534 మార్కులు సాధించి మెడికల్ సీటు పొందిన విద్యార్థిని షమీనాను ఎస్ఎఫ్ఐ నాయకులు సన్మానించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు విద్యార్థిని స్వగృహానికి వెళ్లి సన్మానించారు. విద్యార్థిని భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

'నిండు జాబిలి' పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాళ్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్య వేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 39వ పుస్తకం 'నిండు జాబిలి' బాలగేయాల సంపుటిని ఆదివారం ఆలూరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న ఫోన్ ద్వారా మాట్లాడుతూ సామాజిక సేవకురాలు, విశ్రాంత మండల విద్యాధికారిణి హెచ్.రామలింగమ్మ, సహజ కవి శ్రీ సవ్వప్ప గారి ఈరన్న చేతుల మీదుగా ఆలూరు గ్రంథాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. అనంతరం కవి సోమన్నను ఘనంగా సత్కరించారు. సాహితీ వేత్తలు ప్రతాప్‌స్వామి, విజయభాస్కర్, కేశవయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ గావిస్తున్న సాహితీవేత్తలు

రాజీవ్ గాంధీకి నివాళి

ఆదోని సెంట్రల్: భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు దేవిశెట్టి ప్రకాశ్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ పరిపాలనలో దేశం పురోగతి సాధించిందని తెలిపారు. విద్యారంగం నుంచి టెక్నాలజీ రంగం వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చిన మహానేత అని అభివర్ణించారు. ఆ పార్టీ నాయకులు ఎండీ నూర్, నెట్టెకల్ హనుమంతు, కపిటి బసవరాజు, కలందర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో నడిపిన నాయకుడు

దేశాన్ని ప్రగతి బాటలో నడిపిన మహానాయకుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ హయాంలో సర్పంచ్‌లకు చెక్ పవర్ కల్పించి నిధులను వారి ఖాతాలోకి జమ చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించారని, 18 ఎళ్లకే ఓటు హక్కు కల్పించారని వివరించారు. ఆ పార్టీ నాయకులు దిలీప్ దోకా, సాయినాథ్, వీరేష్, శ్రీనిత్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు దేవిశెట్టి ప్రకాశ్ నాయకులు


ముస్లింలు రాజకీయంగా చైతన్యం కావాలి



మట్లాడుతున్న ముస్లిం నాయకుడు ఉమ్మిసలీం

ఆదోని సెంట్రల్: ముస్లింల సమస్యలను పరిష్కరించాలని మైనార్టీల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరుక్‌సుబ్రి కోరారు. ఆదివారం కేకే ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజకీయ చైతన్య సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ముస్లిం ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఒకరి కింద పనిచేసే బానిస సంకేళ్ల నుంచి బయటికి రావాలని సూచించారు. ముస్లిం నాయకుడు ఉమ్మిసలీం మాట్లాడుతూ.. రాజకీయంగా ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ముస్లిం కూడా రాజకీయ చైతన్యవంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ముస్లిం నాయకులు సాదిరహుఫ్, నసఫ్ అక్రమ్, జిలాన్ బాషా,అబ్దుల్‌రహుఫ్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్



జంపాపురంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో తాగునీటి స్టోరేజ్ నిమిత్తం చాల ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. ట్యాంక్‌కు పలు చోట్ల పెచ్చులూడిపోయి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి ఓవర్ హెడ్ ట్యాంక్ స్థానంలో మరొకటి నిర్మించి గ్రామానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డిని విచారించగా జలజీవన్ మిషన్ కింద ప్రతి గ్రామానికి ఒక ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించేందుకు అనుమతులు వచ్చాయని, త్వరలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మిస్తామన్నారు.

ఈరన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

మంత్రాలయం: మహిమాన్విత ఉరకుంద నారసింహుని క్షేత్రానికి భక్తజనం పోటెత్తుతున్నారు. ఈరన్న స్వామి శ్రావణ మాసోత్సవం పురస్కరించుకుని రోజురోజుకు పాదయాత్రికుల సంఖ్య పెరుగుతోంది. కర్నూలు, కోడుమూరు, రాయచూరు, గద్వాల తదితర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు కాలినడకన తరలివస్తున్నారు. మొదటి సోమవారం సందర్భంగా ఆదివారం కర్నూలు మండలం నిడ్జూరు, పెద్దపాడు గ్రామాల నుంచి 200 మందికి పైగా భక్తులు కాలినడకన ఇక్కడికి చేరుకున్నారు. వీరభద్రుడి వేషధారణలో, మేళతాళాలతో క్షేత్రంలో భక్తులు సంప్రదాయ నృత్యాలు చేశారు. భక్తుల రాకతో ఉరకుంద క్షేత్రంలో ఆధ్యాత్మికత నెలకొంది.



ఉరకుంద క్షేత్రంలో సందడి చేస్తున్న పాదయాత్రికులు

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు భూమి పూజ

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆదివారం రేల్వే స్టేషన్‌లోని రెండవ ప్లాట్‌ఫారం నందు వేద మంత్రాలను వల్లిస్తూ స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్లు కిష్టప్ప, నాగన్న పూజలు నిర్వహించారు. అమృత్ భారత్ స్కీమ్ కింద రూ.83 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వృద్ధులు, వికలాంగులు ఒక ప్లాట్ ఫారం నుంచి మరో ప్లాట్ ఫారంకు వెళ్లేందుకు లిఫ్ట్, రెండవ ప్లాట్ ఫారంలో రేకుల షెడ్డు, గదుల నిర్మాణాలు, వెహికల్ పార్కింగ్ సౌకర్యం వంటి నిర్మాణాలను చేపట్టనున్నారు. రేల్వే అధికారులు బాషా, సునీల్, రైల్వే ఎస్ఐ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న రైల్వే అధికారులు

ఆటోను ఢీకొన్న లారీ

మంత్రాలయం రూరల్: మాధవరం నుంచి మంత్రాలయానికి ఆదివారం సాయంత్రం వెళ్తున్న ఆటోను వంక వంతెనపై వెనకవచ్చిన లారీ ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నందవరం మండలం హాలహర్వికి చెందిన సోఫియా తీవ్రంగా గాయపడింది. లారీ బలంగా ఢీకొట్టడంతో ఆటో వంతెనపైనే బోల్తా కొట్టింది. ఆటో వంతెన పైనుంచి వంకలో పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. ఆటో బోల్తా పడడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. గాయపడిన సోఫియాతో పాటు మరో మహిళను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పల్లెపాడు ఉన్నత పాఠశాలకు మహర్దశ



నాడు - చెట్ల కింద చదువులు



నాడు-నేడు కింద అదనపు గదుల నిర్మాణం

- ఆర్డీటీ సహకారంతో రూ.1.65 కోట్లతో 9 గదులు, కాంపౌండ్ వాల్ ఏర్పాటు
- నాడు-నేడు కింద రూ.2 కోట్లతో 11 అదనపు గదుల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు
- త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పాఠశాల ప్రారంభోత్సవం

కోసిగి: మండలంలోని పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకం, ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కొత్త శోభ సంచరించుకుంది. గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామ శివారులో 10 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాల నిర్మించి సుందరంగా తీర్చిదిద్దారు.

నాడు పాఠశాలలో సౌకర్యాల కొరత

గ్రామంలోని స్కూల్‌ను 2013లో ప్రాథమిక పాఠశాల నుంచి 2017లో ప్రాథమికోన్నత పాఠశాలగా, 2017లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్ చేశారు. అయితే గతంలో ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన 6 గదులలో నేటి వరకు విద్యను కొనసాగిస్తున్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 630 మంది విద్యార్థులు చదువుతున్నారు. కేవలం ఆరు గదులలో, ఆరుబయట చెట్ల కింద చదువుకోలేక గందరగోళంగా చదువులు కొనసాగిస్తూ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అలాగే పాఠశాల ఆవరణంలో ఆట స్థలం లేక ఉన్నంతలో చదువులతో కొనసాగించారు. విద్యార్థులకు ప్రత్యేక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గదులు నిర్మించాలని ప్రజలు, విద్యార్థులు కోరారు.

ఆర్డీటీ సహకారంతో..

ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ.1.67 కోట్లతో గ్రామ శివారులోని ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 9 విశాలమైన తరగతి గదులు, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, టాయిలెట్స్, తగరతి గదిలో బోర్డు వసతితో పాటు అన్ని విధాలుగా విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేలా పాఠశాల నిర్మాణం చేపట్టారు. దీంతో గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, మండల ఉపాధ్యాయులు ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే పాఠశాలను ప్రారంభించి తరగతి గదులను అక్కడే కొనసాగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.

నాడు-నేడుతో అదనపు గదుల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు-నేడు రెండవ విడత కింద పల్లెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోసం రూ.2 కోట్లు వెచ్చించింది. దీంతో అదనంగా మరో 11 గదుల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు బేస్‌మట్టం వరకు నిర్మాణం పూర్తికాగా వేగవంతంగా జరుగుతున్నాయి. దీంతో పల్లెపాడు పాఠశాల రూపు రేఖలు మారిపోతున్నాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



ఆర్డీటీ సహకారంతో నిర్మించిన పాఠశాల భవనం

కొత్త భవనంలో తరగతులు ప్రారంభించాలి



మా గ్రామంలో 10వ తరగతి వరకు పాఠశాలను అప్‌గ్రేడ్ చేశారు. ఆరు గదులలో 1 నుంచి 10వ తరగతి వరకు ఒకరి పక్కన ఒక కూర్చొని గందరగోళంగా చదువులు సాగాయి. గ్రామ శివారులో కొత్త పాఠశాల ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. వెంటనే అక్కడకి మార్చి విద్యను కొనసాగిస్తే బాగుంటుంది.

– దేవేంద్ర, 10వ తరగతి విద్యార్థి

ఆర్డీటీ కృషి మరువలేం



ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ మా గ్రామానికి ప్రత్యేకంగా హైస్కూల్‌ను నిర్మించి ఇవ్వడం చాల సంతోషకరం. ప్రత్యేకంగా తరగతి గదులు, కాంపౌండ్ వాల్, బ్లాక్ బోర్డ్స్, టాయిలెట్స్, కిచెన్ షెడ్ ఆట స్థలంతో కూడిన పాఠశాల నిర్మించారు. వెంటనే పాఠశాలను ప్రారంభించి తరగతులను నిర్వహిస్తే బాగుంటుంది.

– చంద్రకళ, 10వ తరగతి విద్యార్థిని

త్వరలోనే ప్రారంభిస్తాం



ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ పల్లెపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల కోసం బడ్జెట్ కేటాయించి భవనం నిర్మించి ఇవ్వడం చాల సంతోషంగా ఉంది. ఇంకా కొద్ది పాటి మైనర్ రిపేర్లు ఉన్నాయి. వెంటనే చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. త్వరలోనే మంచి ముహూర్తం చూసుకుని ఆర్డీటీ నిర్వాహకులు, జిల్లా ఉన్నత అధికారులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేలా కృషి చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– రామలింగప్ప, హెచ్ఎం